క్లుప్తంగా

లక్ష్యాలను పూర్తి చేయాలి

సిద్దవటం : మండలంలోని 10 గ్రామ సచివాలయాల పరిధిలో ఈ వారం కేటాయించిన 68 పక్కా గృహాల లక్ష్యాలను పూర్తి చేయాలని సీఎస్ఓ శ్రీలక్ష్మి తెలిపారు. సిద్దవటంలోని స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం సాయంత్రం పక్కాగృహాలపై నియోజకవర్గం ప్రత్యేకాధికారి శ్రీలక్ష్మి అధికారులతో సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ పులిరామ్‌సింగ్, వెలుగు పంచాయతీ కార్యదర్శులు, వీఆర్‌ఓలు, ఏపీఎం వెంకటేష్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

నేడు బ్యాంకుల వద్ద ఆందోళనలు

రాయచోటి అర్బన్ : బడా పారిశ్రామికవేత్త అదానీ ఆస్తులను కేంద్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని సీపీఐ అన్నమయ్య జిల్లా కార్యదర్శి పి.ఎల్.నరసింహులు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. 10వతేదీ శుక్రవారం రోజున జిల్లాలోని అన్ని బ్యాంకుల వద్ద సీపీఐ శ్రేణులు ధర్నాలు చేపట్టి అదానీ చేసిన మోసాన్ని ఎలుగెత్తి చాటాలని కోరారు.

15న మండల మీట్

నందలూరు(రాజంపేట) : ఈనెల 15న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సౌభాగ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు తమ గుర్తింపు కార్డులతో హాజరుకావాలన్నారు. పది విభాగాలకు సంబంధించిన అధికారులు సమావేశానికి తప్పకుండా హాజరుకావాలన్నారు. సమావేశం 10.30 గంటలకు జరుగుతుందని వెల్లడించారు. అధికారులు తమ శాఖల నివేదికలను తీసుకురావాలని సూచించారు.

రవీంద్రనాథరెడ్డిపై అసత్య ప్రచారం తగదు

రాయచోటి అర్బన్ : కమలాపురం శాసనసభ్యుడు పి.రవీంద్రనాథరెడ్డిపై అసత్య ప్రచారం తగదని ఆర్టీసీ వైఎస్ఆర్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రామ్మోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. రవీంద్రనాథరెడ్డిని పీటీడీ వైఎస్ఆర్ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవాధ్యక్ష పదవి నుంచి తొలగించినట్లు వార్తను ఒక దినపత్రిక ప్రచురించడం దారుణమన్నారు. తమ యూనియన్‌కు శాశ్వత గౌరవాధ్యక్షుడుగా రవీంద్రనాథరెడ్డి కొనసాగుతారంటూ ఆయన తెలిపారు.

నూతన కార్యవర్గం ఏర్పాటు

నందలూరు(రాజంపేట) : నందలూరు యూటీఎఫ్ నూతన కార్యవర్గాన్ని ఆ సంఘం సీనియర్ నాయకుడు రౌఫ్‌బాషా ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా హరినాథ్, ప్రధాన కార్యదర్శిగా రమేష్, కోశాధికారిగా సుధాకర్‌లను ఎన్నుకున్నారు. సహా అధ్యక్షులుగా బీవీసుబ్బరాయుడు, కృపానందం, మహిళ ఉపాధ్యక్షురాలిగా ప్రసూన, సింగారమ్మ, జిల్లా కౌన్సిలర్లు విశ్వనాథ్, గణేష్, కిరణ్, ప్రేమ్‌కుమార్, శివవరప్రసాద్, స్కూల్ క్లాంప్లెక్స్ కార్యదర్శులుగా జిలానీ, వీరారెడ్డి, చాంద్‌బాషా, రాజశేఖర్ మరో 12 మందిని మండల కార్యదర్శులుగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

సచివాలయ కన్వీనర్లు, గృహసారథులకు దిశానిర్దేశం చేసిన ఎమ్మెల్యే మేడా, జెడ్పీ ఛైర్మన్ ఆకేపాటి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, చిత్రంలో జెడ్పీ ఛైర్మన్ ఆకేపాటి

ఒంటిమిట్ట : సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు చేపట్టబోయే ఈ మా నమ్మకం నువ్వే జగనన్నతో ప్రజల్లో పార్టీపై విశ్వాసం మరింత పెరగాలని రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రమైన ఒంటిమిట్టలోని హరితా కల్యాణ మండపంలో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లతో మండల జేసీఎస్ కన్వీనర్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ‘మా నమ్మకం నువ్వే జగనన్న’ కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేడా మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రజలకు సంతృప్తికరంగా అందాయని తెలిపారు. ఈ పథాలకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వివరించాల్సిన బాధ్యత సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లపై ఉందని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలు పొందిన ప్రతి లబ్ధిదారుని ఇంటికి వెళ్లి పథకాలను వివరించాలని సూచించారు. పథకాలను రాని వారి వివరాలు తీసుకుని సచివాలయ సిబ్బందికి అందించి ప్రజలకు లబ్ధి చేకూర్చాలని తెలిపారు. గత ప్రభుత్వంలో చంద్రబాబు నాయుడు అన్ని వర్గాలను మోసం చేశారని, ఎలా మోసం చేసారో ఉదాహరణకు 2 వేల కోట్లతో అమరావతిలో తాత్కాలికంగా నిర్మించిన సచివాలయానికి, 8 వందల కోట్లతో ఢిల్లీలో నిర్మించిన శాశ్వత పార్లమెంటును తేడాగా తీసుకోమన్నారు. తన పరిపాలన పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలు కూడా అగ్ర వర్ణాల ప్రజలతో పాటు అభివృద్ధి చెందాలనే ఆశయంతో అన్ని వర్గాల ప్రజలకు ఆర్థికంగా అడ్డగా ఉండేవిధంగా సంక్షేమ పథకాలను తీసుకొచ్చారన్నారు. అనంతరం జెడ్పీ ఛైర్మన్ ఆకేపాటి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో ప్రకటించిన రెండు పేజీల నవరత్నాల పథకాలతో అంతటి ఘన విజయాన్ని సొంత చేసుకుని ప్రజలకు ఇంకా ఏదో మేలు చేయాలనే తాపత్రయంతో నవరత్నాల్లో ఉండే 9 పథకాలే కాకుండా వాటితో పాటు మరెన్నో ప్రజలకు ఉపయోగపడే పథకాలను తీసుకొచ్చారన్నారు. ఎవరికైన ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చడానికి 5 సంవత్సరాల పదవి కాలం పడుతుందని, అలాంటిది అధికారంలోకి వచ్చిన రెండు సంవత్సరాల కాలంలోనే ఇచ్చిన హామీలను 90 శాతం నెరవేర్చినటువంటి ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వైస్ ఎంపీపీ గెడ్డం జనార్ధన్‌రెడ్డి, రాష్ట్ర గిడ్డంగుల శాఖ కార్పొరేషన్ డైరెక్టర్ ఆకేపాటి వేణుగోపాల్‌రెడ్డి, రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ కార్పొరేషన్ డైరెక్టర్ ఈ.సుబ్బారెడ్డి, సిద్దవటం వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ వైస్ ఛైర్మన్ ముమ్మడి శ్రీధర్‌రెడ్డి, ఎంపీటీసులు ముమ్మడి నారాయణరెడ్డి, బాషా, సర్పంచులు వెంకటసుబ్బారెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, బాదుల్లా, మేరువ శివనారాయణ, శేఖర్‌రెడ్డి, కో–ఆప్షన్ మెంబర్ ఎస్.ఎం.డి రఫీ, వైఎస్సార్‌సీపీ నాయకులు గజ్జల శ్రీనివాసులరెడ్డి, పిడుగు సుబ్బారెడ్డి, బ్యాంకు శివారెడ్డి, తేలూరు శేషారెడ్డి, ఆకేపాటి వెంకట శివారెడ్డి, కూండ్ల ఓబుల్‌రెడ్డి, గురుమోహన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు వీరబల్లిలో..

వీరబల్లి : సచివాలయం కన్వీనర్లు, వలంటీర్లు, గృహసారథులకు అవగాహన కార్యక్రమం నేడు శుక్రవారం ఎమ్మెల్యే మేడా ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్టు ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. బల్సానిపల్లిరోడ్డులోని మామిడి పండ్ల మండి సమీపంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో సమావేశం ఉంటుందన్నారు.

సంక్షేమ పాలన సీఎం జగన్‌తోనే సాధ్యం


పథకాలను లబ్ధిదారులకు వివరిస్తున్న ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు

ఓబులవారిపల్లె : సంక్షేమ పాలన సీఎం జగన్‌తోనే సాధ్యమని ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. గురువారం గాదెల వెంటాపురం, చెంచువారిపల్లె గ్రామాలలో ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు, ఏపీటీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయికిషోర్‌రెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమన్ని నిర్వహించారు. గ్రామాలలోని ప్రతి గడపకు వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం కుటుంబాలకు అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకొన్నారు. సంబంధిత అధికారులను సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అందక ప్రజలు అగచాట్లు పడ్డారన్నారు. జన్మభూమి కమిటీల పేరుతో తన పార్టీకి చెందిన వారికే ప్రభుత్వ ప్రయోజనలు కల్పించారని ఆరోపించారు. ఎవరైన చనిపోతే తప్ప కొత్త పింఛన్‌లు మంజూరు కాని గడ్డు పరిస్థితులు చంద్రబాబు నాయుడు పాలనలో సాగిందని గుర్తు చేశారు. ప్రస్తుతం రాష్ట్రానికి సీఎం జగన్ ముఖ్యమంత్రి అయ్యాకా అర్హత ఉండి దరఖాస్తు చేసుకున్న వారందరికి పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలను అందిస్తున్నారన్నారు. సచివాలయం, వలంటరీ వ్యవస్థ ఏర్పాటు చేసి మెరుగైన పాలనను అందిస్తున్నారని అన్నారు. రాబోయే రోజుల్లో జగనన్నకు ప్రజలంతా అండగా ఉండి మరోసారి సీఎంగా గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీటీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయికిషోర్‌రెడ్డి, సర్పంచ్‌లు కానిపాకం సుబ్బలక్ష్మి, పోలి పాపిరెడ్డి, మాజీ ఎంపీపీ రామకృష్ణయ్య, రాష్ట్ర ప్రచార కార్యదర్శి సీడీ నాగేంద్ర, ఎంపీడీఓ విజయారావు. సీనియర్ నాయకులు కొమ్మురు భాస్కర్‌రెడ్డి, వైఎస్సార్ పార్టీ నాయకులు కే నారాయణరెడ్డి, కొలవల అమర్‌నాథ్‌రెడ్డి, కే శంకర్‌రెడ్డి, చిన్నిరెడ్డి ఆశోక్‌రెడ్డి, ఎస్‌ఐ శ్రీకాంత్‌రెడ్డి, ఆర్‌ఐ రామ్మోహన్, వెలుగు ఏపీఎం అర్ముగమ్, పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతను పాటించండి

వీరబల్లి : మండలంలోని కస్తూర్బా బాలికల గురుకుల విద్యాలయంలోని విద్యార్థినులకు గురువారం వ్యక్తిగత పరిశుభ్రత పట్ల అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి సీడీపీఓ పద్మజ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అదేవిధంగా వీరబల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ వినయ్ బాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా వినయ్ బాబు మాట్లాడుతూ పిల్లలు ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉండాలని, ముఖ్యంగా పర్సనల్ హైజిన్, గుడ్‌టచ్ అండ్ బ్యాడ్ టచ్, చైల్డ్ మ్యారేజెస్, వ్యక్తిగత పరిశుభ్రత గురించి తెలియజేశారు. అనంతరం సీడీపీఓ పద్మజ కళాశాల ఎస్ఓ కుసుమలతతో కలిసి కళాశాల కమిటీ పిల్లల పనితీరును పరిశీలించారు. అనంతరం పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. పిల్లలు ఆరోగ్య సమస్యలు కనుగొని వారికి సరైన సమయంలో ఎలా చికిత్స చేయాలో తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలకే ‘విలేజ్ డాక్టర్’

ఓబులవారిపల్లె : గ్రామీణ ప్రాంతాల రోగులకు మెరుగైన వైద్యం అందించాలనే ప్రభుత్వం విలేజ్ డాక్టర్ కార్యక్రమాన్ని తీసుకొచ్చినట్టు వైద్యాధికారిణి రూప తెలిపారు. గురువారం మంగంపేట సచివాలయంలో వైద్యాధికారిణి రూప ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విలేజ్ డాక్టర్ కార్యక్రమం పూర్తిస్థాయిలో అమలవుతోందన్నారు. ప్రతిరోజూ గ్రామాలలో ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు ప్రజలకు ముందస్తు సమాచారం అందిస్తారని, మరుసటిరోజు 104 వాహనం ద్వారా గ్రామాలకు వెళ్ళి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు.

నిరుద్యోగులకు ఉపాధి కల్పించడమే లక్ష్యం

ఓబులవారిపల్లె : నిరుద్యోగ యువతీయువకులకు ఉపాధి కల్పించడమే లక్ష్యమని ఏపీఎండీసీ సీపీఓ వెంకటరమణ పేర్కొన్నారు. గురువారం మంగంపేట సచివాలయం ప్రత్యేక శిక్షణ పొందిన నిరుద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఓ వెంకటరమణ మాట్లాడుతూ ఏపీఎండీసీ సీఎస్ఆర్ నిధులతో డిగ్రీ చదివిన వారికి రెండు నెలల పాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. నలభై మంది నిరుద్యోగులకు దేశంలో ప్రాధాన్యత కలిగిన ఎం జంక్షన్, ఈ జంక్షన్, ది టైమ్స్ ఆఫ్ ఇండియా గ్రూప్ వారిచే శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్నావారికి ప్రైవేటు బ్యాంకుల ద్వార ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. రెండవ బ్యాచ్‌కు అసక్తి కలిగిన నిరుద్యోగులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. శిక్షణ పూర్తి చేసుకున్న మొదటి బ్యాచ్ విద్యార్థులకు అభినందనలు తెలిపారు. సర్పంచ్ మినుగు సుధాకర్ మాట్లాడుతూ ఎంతో ఖర్చుతో కుడుకున్న శిక్షణ తరగతులను స్థానిక సచివాలయంలో నిరుద్యోగులకు ఏపీఎండీసీ సంస్థ ఉచితంగా నిర్వహించడం సంతోషకరమని తెలిపారు. ఈ కార్యక్రమలో డీజీఎం బేరజీ, ఎంపీటీసీ హరిబాబు, సీఎస్ఆర్ ఎంప్లాయి శగినాల సుబ్రమణ్యం, పోకూరు మురళీ తదితరులు పాల్గొన్నారు.

పూత, పిందె దశలో అప్రమత్తంగా ఉండండి

ఓబులవారిపల్లె : మామిడి పూత, పిందె దశలో మామిడి రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలని అనంతరాజుపేట ఉద్యానవన కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ కె.గోపాల్ పేర్కొన్నారు. గురువారం వైకోట గ్రామంలో ఎస్సీ ఉప ప్రణాళిక కింద అనంతరాజుపేట ఉద్యానవన కళాశాల వారు రైతులకు అవగాహన, శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ సయ్యద్ సదరున్నీషా మాట్లాడుతూ పుచ్చకాయ, దోస పంటల పెంపకం, పెరటితోటల పెంపకంపై రైతులకు అవగాహన కల్పించారు. వివిధ పంటల సాగుపై రైతులకు వివరిస్తూ రైతుల సందేహాలను నివృత్తి చేశారు. అనంతరం రైతులకు శిక్షణా తరగతులను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉద్యానకళాశాల అధ్యాపకులు డాక్టర్ జి శారద, ఆచార్యులు డాక్టర్ రూత్, కెఎం యువరాజ్, రామయ్య, సుందర్ రెడ్డి, లలిత, రాజేశ్వరి, కళాశాల విద్యార్థులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

టార్గెట్ పూర్తి చేయకుంటే నోటీసులు

పెనగలూరు : హౌసింగ్‌లో సిబ్బంది టార్గెట్ పూర్తి చేయకుంటే నోటీసులు జారీ చేస్తామని హౌసింగ్ డీఈ కుప్పుస్వామి తెలిపారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో హౌసింగ్, ఇంజనీరింగ్ డిపార్టుమెంట్, సంబంధిత సిబ్బందితో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో జగనన్న కాలనీలలో హౌసింగ్ పనులు వేగంగా జరగడం లేదని, మీకు ఇచ్చిన టార్గెట్ పూర్తిచేయకుంటే నోటీసులు ఇచ్చి జిల్లాస్థాయిలో ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేస్తామని తెలిపారు. అలాగే లబ్ధిదారులకు అవగాహన కల్పించి వెంటనే పనులు వేగవంతంగా నిర్వహించేందుకు కృషి చేయాలన్నారు. పనులు చేసుకున్నవారికే బిల్లులు అందిస్తూ కాలయాపన చేస్తున్నారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ వరప్రసాద్, ఏఓ పద్మభూషన్ రెడ్డి, హౌసింగ్ ఏఈ హరిప్రసాద్, ఈఓపీఆర్‌డీ సుధాకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

శివరాత్రి ఉత్సవాలకు అంకురార్పణ


పూజలందుకుంటున్న ఉత్సవమూర్తులు

రాజంపేట టౌన్ : పట్టణంలోని వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో గురువారం ఆ ఆలయ ఛైర్మన్ లక్ష్మీప్రసన్న ఆచారి ఆధ్వర్యంలో శివరాత్రి బ్రహోత్సవాలకు ఘనంగా అంకురార్పణ చేశారు. ఈ సందర్భంగా వేకువజాము నుంచే ఆలయ ప్రధాన అర్చకులు అరుణకుమారాచారి నేతృత్వంలో విశేషంగా పూజా కార్యక్రమాలను నిర్వహించారు. వీరబ్రహ్మేంద్రస్వామి, గోవిందమాంబల ఉత్సవమూర్తులను పట్టువస్త్రాలతో, ప్రత్యేక పుష్పాలతో శోభాయమానంగా అలంకరించి అభిషేకాలు, అర్చనలు చేశారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండండి

రాజంపేట టౌన్ : భవన నిర్మాణ కార్మికులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని అర్బన్ సీఐ నరసింహారావు తెలిపారు. భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన క్యాలెండర్‌ను గురువారం నరసింహారావు ఆవిష్కరించారు. అర్బన్ ఎస్ఐలు ప్రసాద్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, భవన నిర్మాణ కార్మిక సంఘం ప్రతినిధులు గాలి చంద్రయ్య, వెంకటయ్య, ఎంఎస్.రాయుడు, ఖాజావలీ, నాగభూషణం, మల్లికార్జున, మహమ్మద్ షరీఫ్, బ్రహ్మయ్య, వెంకటసుబ్బయ్య, మహమ్మద్ హుస్సేన్, ముజఫర్ పాల్గొన్నారు.

అన్ని రైళ్లకు స్టాపింగ్ కల్పించండి

రాజంపేట టౌన్ : రెవెన్యూ డివిజనల్ కేంద్రమైన రాజంపేట రైల్వేస్టేషన్‌లో అన్ని రైళ్లకు స్టాపింగ్ సౌకర్యం కల్పించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి చిట్వేలి రవికుమార్ డిమాండ్ చేశారు. స్థానిక ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో గురువారం ఆయన ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి నరసింహాతో కలిసి విలేకరులతో మాట్లాడారు. కరోనాకు ముందు ఎలా అయితే స్టాపింగ్ ఉండేదో అలాగే తిరిగి తీసుకురావాలని తెలిపారు. లేకుంటే ఆందోళనలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు రమణ తదితరులు పాల్గొన్నారు.

సర్వే ఉద్యోగుల డైరీ ఆవిష్కరణ

రాయచోటి టౌన్ : అన్నమయ్య జిల్లా సర్వే ఉద్యోగుల సంఘం డైరీని అన్నమయ్య జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ ఆవిష్కరించారు. గురువారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో డైరీలను విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ఉన్న సర్వే పనులు ఎప్పటికప్పుడు గడువు లోపల పూర్తి చేయాలని సూచించారు. జేసీ తమీమ్ అన్సారియా, డీఆర్ఓ సత్యనారాయణ, ల్యాండ్ అండ్ సర్వే ఏడీ జయరాజు, ఆర్‌డీఓ రంగస్వామి, సర్వేయర్లు పాల్గొన్నారు.

హామీల అమలులో దేశానికే ఆదర్శం


పథకాల లబ్ధిని వివరిస్తున్న రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి

- రామరాజ్యంలా జగనన్న పాలన
- ఎస్ సోమవరంలో రెండవ రోజు గడప గడపకు కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

సంబేపల్లె : సంక్షేమ పథకాలతోనే పేదల అభివృద్ధి జరుగుతుందని వైఎస్సార్‌సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం సంబేపల్లె మండలం ఎస్ సోమవరం గ్రామంలో రెండవ రోజు గడప గడపకు మన ప్రభుత్వంలో శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు. గ్రామంలోని బావులకాడపల్లె, ఎగువ నల్లగుట్టపల్లె, దిగువ నల్లగుట్టపల్లె, సోమవరంలో ప్రతి ఇంటి గడపకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా అని ప్రజలకు అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాలు అందడంలేదని తన దృష్టికి తీసుకొచ్చిన ప్రజలకు వెంటనే అధికారుల ద్వారా పరిష్కార మార్గాన్ని చూపించారు. వీధులలో నెలకొన్న సమస్యల పరిష్కారంపై ఆయన ప్రత్యేక దృష్టిని సారించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా జగన్‌పాలన సాగుతోందన్నారు. సమస్యల పరిష్కారానికే గడప గడపకుమన ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకే జగనన్న ప్రభుత్వం ప్రాధాన్యతను ఇస్తుందన్నారు. హామీలను అమలులో దేశానికే ఆదర్శంగా సీఎం జగన్ నిలుస్తున్నారన్నారు.

గడప గడపనా సంతృప్తి

ఎస్ సోమవరం గ్రామంలో అమ్మ ఒడి, విద్యాదీవెన, వసతి దీవెన, ఆసరా, చేయూత తదితర పథకాలు దాదాపు అన్ని ఇళ్లకు అందాయి. ప్రతి ఇంటికి సంక్షేమ పథకాల లబ్ధి చేకూరడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. నిండు మనసుతో సీఎం జగన్‌ను మరోసారి గెలిపించాలని కోరారు. పాలరైతులకు గిట్టుబాటు ధరలు కల్పించి జగన్ ప్రభుత్వం అండగా ఉందని శ్రీకాంత్‌రెడ్డి రెడ్డి అన్నారు. సోమవరం గ్రామంలోని పాల రైతులతో ఆయన మాట్లాడారు. పాలవెల్లువతో రైతులకు మంచి జరుగుతోందన్నారు.

విలేజ్ క్లినిక్ ప్రారంభం

వైద్యరంగంలో ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి విప్లవాత్మక మార్పులు తెచ్చారని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. ఎస్.సోమవరంలో నూతనంగా నిర్మించిన విలేజ్ క్లినిక్ భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ డీసీఎంఎస్ ఛైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, వైఎస్ఆర్‌సీపీ రాష్ట్రకార్యదర్శి చిదంబర్‌రెడ్డి, ఎంపీపీ నాగశ్రీలక్ష్మి, స్థానిక సర్పంచ్ అనుసూయ, మండల కన్వీనర్ ఉదయకుమార్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు రవీంద్రనాయుడు, మాజీ జెడ్పీటీసీ ఉపేంద్రనాధ్‌రెడ్డి, మాజీ సర్పంచ్ పాలవెంకటరమణ, మండల స్థాయి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

గండి అంజన్న సన్నిధిలో..

చక్రాయపేట : గండి క్షేత్రంలో వెలసిన వీరాంజనేయ స్వామిని గురువారం అన్నమయ్య జిల్లా రాయచోటి శాసనసభ్యుడు గడికోట శ్రీకాంత్ రెడ్డి దర్శించుకున్నారు. ఆయనతోపాటు అన్నమయ్య జిల్లా ఎంపీపీల సంఘం అధ్యక్షుడు మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి పాల్గొన్నారు.

నూతన వధూవరులను ఆశీర్వదించిన శ్రీకాంత్‌రెడ్డి

గండి క్షేత్రంలోని శ్రీవాసవీ ఆర్యవైశ్య నిత్యాన్నదాన సత్రంలో లక్కిరెడ్డిపల్లె మండలం దియ్యల వాండ్లపల్లెకు చెందిన వైఎస్ఆర్‌సీపీ నేత దియ్యల వెంకటసుబ్బయ్య కుమారుడి వివాహానికి ఎమ్మెల్యే హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

ప్రతినెలా 1వ తేదీనే జీతాలివ్వాలి

రాయచోటి అర్బన్ : ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రతినెలా 1వ తేదీనే జీతాలివ్వాలని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు సాయిశ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం రాత్రి స్థానిక ఎస్టీయూ కార్యాలయంలో జరిగిన ముఖ్యనాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు.ఎస్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు సుబ్రమణ్యంరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి సునీల్‌కుమార్, నేతలు ఆదిశేషారెడ్డి, నాగరాజు, మురళి, వాసుదేవరెడ్డి, సుధాకర్, వెంకటసుబ్బయ్య, శంకర్ రెడ్డి, జగదీష్, శివశంకర్ పాల్గొన్నారు.

చిట్వేలి : జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు సాయి శ్రీనివాస్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని ఉపాధ్యాయులతో సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో ఉపాధ్యాయుల సమస్యలు, అధిక పనిభారం, యాప్‌లు అనే అంశాలపై చర్చించారు. రాష్ట్ర కౌన్సిలర్ ఆదినారాయణ రెడ్డి, హరినాథ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృష్ణమూర్తి, భాస్కర్ రావు, మండల ఎస్టీయూ నాయకులు యుగంధర్, దుర్గరాజు, రాజశేఖర్ తదితర ఉపాధ్యాయులు, ఏబీఎస్ ప్రసాద్, చంద్రయ్య, అమ్ములు, నీలిమ, కరుణమ్మ, గాయత్రి, గోపి, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

11న జాతీయ మెగా లోక్ అదాలత్

రాజంపేట : ఈనెల 11న రాజంపేట కోర్టులో జరిగే మెగా లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలంటూ రాజంపేట పోలీసులు గురువారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ నరసింహారావు మాట్లాడుతూ మెగా లోక్ అదాలత్‌లో రాజీకాదలిచిన కేసులను పరిష్కరించేందుకు వీలవుతుందన్నారు. కక్షిదారులు, ఫిర్యాదుదారులు వారి వారి కేసులను పరిష్కరించుకోవల్సిందిగా ర్యాలీ ద్వారా కోరుతున్నామన్నారు. పట్టణవాసులకు మెగా లోక్ అదాలత్ నిర్వహణ పట్ల అవగాహన కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ ప్రసాద్‌రెడ్డి, పోలీసులు, భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

లక్కిరెడ్డిపల్లి : ఈనెల 11వ తేదీన జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో బ్యాంకు రుణాల కేసులు, ఇతర కేసుల పరిష్కారానికి వినియోగించుకోవాలని సీఐ వరప్రసాద్ తెలిపారు. ప్రస్తుత సమాజంలో రాజీయే రాజమార్గమని అందరూ కేసులను పరిష్కరించుకొని తమ విలువైన సమయాన్ని వృథా కాకుండా చూసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

రామాపురం : మెగా లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఐ కొండారెడ్డి పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు గురువారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ నుండి నాలుగు రోడ్ల కూడలి వరకు జాతీయ మెగా లోక్ అదాలత్ కార్యక్రమంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు.

గాలివీడు : ఈనెల 11వ తేదీ లక్కిరెడ్డిపల్లి కోర్టులో జరగనున్న లోక్ అదాలత్ కార్యక్రమాన్ని మండల ప్రజలు, కేసులో ఉన్నా ముద్దాయిలు సద్వినియోగం చేసుకోవాలని గాలివీడు ఎస్ఐ వెంకట శివకుమార్ తెలిపారు. మండలంలో పలు ఘర్షణలకు పాల్పడి కేసు నమోదై కోర్టు చుట్టూ తిరగకుండా లోక్ అదాలత్ ద్వారా రాజీ మార్గం కుదురుతుందని, కేసులలో ఉన్న ముద్దాయిలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పలు కేసులలో ఉన్న వారికి అవగాహన సదస్సు నిర్వహించి లోక్ అదాలత్‌పై సూచనలు, సలహాలు ఇచ్చారు.

రాయచోటి టౌన్ : ఈ నెల 11వ తేదీన జాతీయ లోక అదాలత్ నిర్వహిస్తోందని రాయచోటి అర్బన్ సీఐ సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు గురువారం సాయంత్రం రాయచోటి పట్టణంలోని ప్రజలకు అవగాహన కల్పించేందుకు పోలీసులతో కలసి ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ లోకఅదాలత్‌ను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.